పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి ● అధికారులతో సమావేశం

కలెక్టరేట్: సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, మార్చి 27: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే ప్రతి ఉద్యోగికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పనపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయని, మే 13న పోలింగ్ జరుగనుందని, విధి నిర్వహణలో భాగంగా పోలింగ్‌రోజు ఓటు వేసే అవకాశం లేని, ప్రభుత్వశాఖల ఉద్యోగులకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలని తెలిపారు. పోలింగ్ రోజు ఓటు వేయలేని వారి కోసం ఫారం 12డీని అందుబాటులో ఉంచామని, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ కోసం ప్రత్యేక నోడల్ అధికారిని నియమిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలని కోరారు. రవాణాశాఖ, మీడియా, విద్యుత్, బీఎస్ఎన్ఎల్ పోస్టల్ టెలిగ్రామ్, దూరదర్శన్, ఆకాశవాణి, రాష్ట్ర మిల్క్ యూనియన్, మిల్క్ కోఆపరేటివ్ సొసైటీలు, ఆరోగ్యశాఖ, ఫుడ్ కార్పొరేషన్, ఆర్టీసీ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీసు, మొదలైన 33 అత్యవసర శాఖల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్స్ సౌకర్యం కల్పించామన్నారు. అలాగే కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 85 ఏండ్ల వయసు గల వారు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకుంటే వారి ఇంటి వద్దకు ఇద్దరు పోలింగ్ అధికారులు వీడియోగ్రాఫర్ సెక్యూరిటీగా వచ్చి ఓటు వేసే అవకాశం కల్పిస్తారని, ఏ తేదీ, ఏ సమయంలో వచ్చేది ముందుగానే సమాచారం ఇస్తారన్నారు. పోస్టల్ బ్యాలెట్లు పొందడానికి ఫారం-12డీని సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుందన్నారు. అర్హత ఉన్నవారికే రిటర్నింగ్ అధికారి పోస్టల్ బ్యాలెట్ మంజూరు చేస్తారని తెలిపారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసే ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ వద్దకు వెళ్లి తమ ఓటు నమోదు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పీ గౌతమి, భీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, డీఈవో రమేశ్‌కుమార్, డీడబ్ల్యూవో లక్ష్మీ రాజం, ఏవో రాంరెడ్డి, ఎలక్షన్ పర్యవేక్షకులు, ఈడీఎం శ్రీకాంత్, అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: ఎస్పీ

తెలంగాణ చౌక్, మార్చి 27: రాబోయే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఎన్నికలు పురస్కరించుకొని పోలీస్ అధికారులు నిర్వహించాల్సిన విధి విధానాలపై సమీక్షా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతీ అధికారి ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని సూచించారు. పోలింగ్ ముందురోజు, తర్వాతి రోజు పోలీస్ సిబ్బంది నిర్వర్తించాల్సిన విధుల గురించి అవగాహన కల్పించారు. జిల్లాలోని చెక్‌పోస్టులు, జిల్లా భౌగోళిక పరిస్థితుల గురించి సీఐఎస్ఎఫ్ సిబ్బందికి వివరించారు. ఇక్కడ డీఎస్పీ నాగేంద్రాచారి, సీఐ సదన్‌కుమార్, ఎస్‌బీ సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐలు ఉన్నారు.

ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

కోనరావుపేట, మార్చి 27: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా వివిధ రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలని సూచించారు. ఇక్కడ ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

తెలంగాణ చౌక్: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

కోనరావుపేట: వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు

మాజీ సర్పంచులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్

వినోద్‌ను కలిసిన మాజీ సర్పంచులు

చందుర్తి, మార్చి 27: బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను బుధవారం మండల మాజీ సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిశారు, రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలో పార్టీ పరిస్థితి, అనుసరించాల్సిన వ్యూహాలను ఆయనకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వినోద్ కుమార్ గెలుపు కోసం పూర్తి స్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ మాజీ సర్పంచులు కమలాకర్‌రావు, దుమ్ము అంజయ్య, లింగంపల్లి కరుణాకర్, అంబెరి కల్పన రేష్, రాపల్లి గంగాధర్, ఆట్టపల్లి రమ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య ఉన్నారు.

సారంపల్లిలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న ఎంపీపీ మానస, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజన్న, నాయకులు

కరువు తెచ్చింది కాంగ్రెస్సే

● ఎంపీపీ పడిగెల మానస, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజన్న ● సారంపల్లిలో ఎండిన పంట పొలాల పరిశీలన

సిరిసిల్ల రూరల్, మార్చి 27: పచ్చదనంతో కళకళలాడే తెలంగాణ రాష్ట్రంలో.. కాంగ్రెస్ తెచ్చిన కరువుతోనే రైతులకు అపార నష్టం కలిగిందని ఎంపీపీ పడిగెల మానస, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న మండిపడ్డారు. తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో సాగునీరందక ఎండిపోయిన పంటలను బుధవారం వారు పార్టీ శ్రేణులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కోతకు వచ్చిన పంటలకు సాగునీరు ఇవ్వక పోవడంతో ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రైతు బంధు సరిగా ఇవ్వలేదన్నారు. మేడిగడ్డ కుంగిందని చెప్పి, రైతుల పంటలకు సాగునీరు ఇవ్వకుండా నష్టం చేసిందని మండిపడ్డారు. అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో రైతులే తగిన గుణపాఠం చెబుతారన్నారు. పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పడిగెల రాజు, జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు, మాజీ సర్పంచ్ రమేశ్, ఎంపీటీసీ గుగ్గిళ్ల లావణ్య, ఆంజనేయులు, సుధాకర్, అమర్‌రావు, సిలువేరి చిరంజీవి, పరశురాములు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ఇద్దరి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టాటాపికప్ వాహనం డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు బుధవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం పక్కా సమాచారంతో అక్కపల్లి శివారులో ఇసుకను అక్రమంగా తరలించే క్రమంలో లోడ్‌తో ఉన్న ఓ పికప్ వాహనాన్ని పట్టుకున్నామని చెప్పారు. ఇందుకు కారణమైన డ్రైవర్ ఆలకుంట రాజు, ఓనర్ ఆలకుంట శేఖర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు. గతంలో కూడా పలు నేరాలకు పాల్పడిన కారణంగా ఇద్దరిని 15రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించి కరీంనగర్ జైలుకు తరలించినట్లు ఏఎస్ఐ బీ కిషన్‌రావు తెలిపారు.

నేత్రపర్వంగా శివకల్యాణమహోత్సవాలు

ఆలయ కల్యాణమండపంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, మార్చి 27: రాజన్న ఆలయంలో ఐదు రోజులపాటు జరిగే శివ కల్యాణ మహోత్సవాలు బుధవారం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో వివిధ రకాల పూజలు చేశారు. గురువారం ఉదయం 10.50నుంచి 12.55 గంటల వరకు అభిజిత్ లగ్న సుముహూర్తమున ఆదిదంపతుల కల్యాణం కనులపండుగగా నిర్వహిస్తామని స్థానాచార్యుడు వెల్లడించారు. శివకల్యాణ మహోత్సవం సందర్భంగా చేసిన ఏర్పాట్లను పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. క్యూలైన్లు, ఆలయ ప్రాంగణంలోని చలువపందిళ్లు, కల్యాణ వేదికను పరిశీలించి, పలు సూచనలు చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, FAHIM FATHIMA, W/o. Syed Anwaruddin, R/o. 2-7-579, Mukarampura, Karimnagar, T.S. have Changed My Name as FAHEEM FATHIMA, W/o. Syed Anwaruddin. NT-328852

★I, SHEELAM SAILEKH RAJ, R/o. 10-5-17/1, Kisan Nagar, Karimnagar, T.S. have Changed My Name as SHEELAM VISHWA SAI LEKH RAJ, S/o. Chiranjeevi. NT-328852

★I, ALLADI SHYLEJA, R/o. 3-6-510/1, Subhash Nagar, Karimnagar, T.S. have Changed My Name as ALLADI SHAILAJA, D/o. Alladi Vykuntam. NT-328852

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

1న డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

గంభీరావుపేట, మార్చి 27: మండల కేంద్రంలోని కేజీ టూ పీజీ విద్యా సముదాయంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 1న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2018-23 మధ్యన డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదివే విద్యార్థులు సైతం జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. స్పందన, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, మెడిప్లస్, అమెజాన్ తదితర కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని చెప్పారు. ఒర్జినల్ సరిఫికెట్లతోపాటు నాలుగు సెట్లు జిరాక్స్‌తో అభ్యర్థులు సకాలంలో ఇంటర్వ్యూకు రావాలని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, మార్చి 27: మూడు నెలల ప్రత్యేక ఫౌండేషన్ కోర్సు కోసం జిల్లాలోని ఎస్సీ అభ్యర్థుల నుంచి ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి గానూ జిల్లాలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మూడు నెలలు ఫౌండేషన్ కోర్సు, రాష్ట్ర స్థాయి పరీక్షలతోపాటు 9 జూన్ 2024న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కోసం వందమంది నిరుద్యోగ అభ్యర్థులకు రెసిడెన్షియల్ పద్ధతిలో మూడు నెలల వరకు భోజన వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులైన ఎస్సీ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం నంబర్‌లో (95156 22390) సంప్రదించాలని తెలిపారు.

అవగాహన సదస్సు

సిరిసిల్ల టౌన్, మార్చి 27: నిధి అప్‌కే నికాత్‌లో భాగంగా పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో పెద్దూరులోని గ్రీన్ నీడిల్ సంస్థలోని కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కరీంనగర్ రీజనల్ కమిషనర్ తానయ్య, జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఏనుగు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్మికులకు ఈపీఎఫ్ యాక్ట్ 1952, పింఛన్ 1971, ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించారు. ఇక్కడ సల్మాన్‌రాజు, కుమార్, హెప్సిబ, హరీష్, తదితరులు ఉన్నారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

ఇల్లంతకుంట, మార్చి27: గాలిపెల్లిలోని పెద్దమ్మ ఆలయంలో బుధవారం చోరీ జరిగింది. ఆలయ చైర్మన్ ఎంజ నారాయణ మాట్లాడుతూ, బుధవారం ఆలయానికి రాగానే తాళం పగలగొట్టి ఉండడం, అమ్మవారి ముక్కుపుడక, పుస్తెమట్టెలు, ఐదు కిలోల రాగి గంట, హుండీ ధ్వంసమై ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చిన్నారి కంటికి గాయం

● తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వని స్కూల్ యాజమాన్యం
● ఆపరేషన్ చేయించినమందగించిన కంటిచూపు ● పాఠశాలపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: మండల కేంద్రానికి చెందిన కోనేటి అద్వైత్(6) మండల కేంద్రంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. గత జనవరి 9న అద్వైత్ పాఠశాలకు వెళ్లాడు. ఈ క్రమంలో ఓ బాలుడు పెన్సిల్‌తో ఆడుతుండగా అది కాస్త వచ్చి అద్వైత్ కుడి కంటిపాపకు గుచ్చుకున్నది. జరిగిన ఘటన యాజమాన్యానికి తెలిసినా సాయంత్రం వరకు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదు. సాయంత్రం నొప్పి ఎక్కువ కావడంతో ఉపాధ్యాయులు అద్వైత్ తండ్రి రమేశ్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే ఇంటికి తీసుకెళ్లాడు. బాలుడి కంటి పాప నుంచి రక్తం కారుతుండడంతో సిద్దిపేటలోని ఓ దవాఖానలో కంటికి ఆపరేషన్ చేయించారు. అయినప్పటికీ కంటిచూపు మందగించడంతో హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ దవాఖానకు తీసుకెళ్లి చికిత్స అందించేందుకు అద్వైత్ తల్లిదండ్రులు ప్రయత్నిస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాలుడి తండ్రి రమేశ్ గత ఫిబ్రవరి 9న ఠాణాలో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

సిద్దిపేట దవాఖానలో సర్జరీ చేయించుకున్న తర్వాత అద్వైత్

నేడు బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

వేములవాడ, మార్చి 27: వేములవాడ బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికను గురువారం నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి విద్యాసాగర్‌రావు తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత అధ్యక్ష స్థానానికి పిట్టల మనోహర్, గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి పదవికి భానుకృష్ణ, అవధూత రజినీకాంత్, సంయుక్త కార్యదర్శికి రమేశ్, శంకర్, లైబ్రేరియన్ కార్యదర్శికి మహేందర్, గుజ్జే మనోహర్, రాజ్ కుమార్, క్రీడలు, ఆటల కార్యదర్శికి సంపత్ కుమార్, ఎస్ శ్రీనివాస్ పోటీలో ఉన్నారని తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ప్రతాప సంతోష్, మహిళా రిప్రజెంటివ్‌గా అన్నపూర్ణ, జూనియర్ ఈసీ మెంబర్లుగా నవీన్, రాకేశ్, వంశీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. సీనియర్ ఈసీ మెంబర్లుగా బాలరాజు రమేశ్, పంపరి శంకరయ్య, శేఖర్, జట్టి శ్రీనివాస్, కే సుజాత పోటీలో ఉన్నారని చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు ఓటింగ్ నిర్వహించి రెండు గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. బార్ సభ్యులు సమయపాలన పాటించి ఓటింగ్‌లో పాల్గొని సహకరించాలని కోరారు.

సామాజిక సేవలో భాగస్వాములవ్వాలి

హెచ్ఎం దంపతులను సన్మానిస్తున్న డీఈవో, గ్రామస్తులు

కోనరావుపేట, మార్చి 27: ప్రతిఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం కొలనూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించిన కోడూరు ఎల్లయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమానికి డీఈవో హాజరయ్యారు. ఎల్లయ్య దంపతులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపిక అందించారు. ఇక్కడ ఎంఈవో రఘుపతి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ వీరవేని తిరుపతి, మాజీ సర్పంచ్ అబ్దుల్ రషీద్, ఎంపీటీసీ ప్రవీణ్ ఉన్నారు.

మెరుగైన సేవలందించాలి

● నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

సిరిసిల్ల రూరల్, మార్చి27: సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పిలుపునిచ్చారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు సింగిల్‌విండో సర్వసభ్య సమావేశం చైర్మన్ జీల కిషన్‌యాదవ్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కొండూరి మాట్లాడుతూ, కేడీసీసీ బ్యాంక్ సేవ లను విస్తరిస్తున్నామని, రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామని తెలిపారు. ఎస్‌బీఐ పరిధిలో ఉన్న పెద్దూరు సింగిల్‌విండోను కేడీసీసీ బ్యాంకులో విలీనం చేయడం సంతోషకరమన్నారు. తద్వారా రైతులకు మరిన్ని మెరుగైన సేవలందిస్తామని చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్ నారయణగౌడ్, సీఈవో గౌరిశంకర్, కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, డైరెక్టర్లు, రైతులు, తదితరులు ఉన్నారు.

పలువురు నాయకుల పరామర్శ

ముస్తాబాద్, మార్చి 27: నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కడపత్రి ప్రకాశ్‌రావును బుధవారం పలువురు నాయకులు, విలేకరులు పరామర్శించారు. ప్రకాశ్‌రావు తల్లి సావిత్రిబాయి ఇటీవల మృతిచెందగా, చీర్లవంచ పరిధిలోని నాయినోరిపల్లెలోని వారి ఇంటికి నాయకులు, విలేకరులు వెళ్లారు. ముందుగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ పోత్గల్ సహకార సంఘం చైర్మన్ తన్నీరు బాపూరావు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏలు కుంబాల మహేందర్‌రెడ్డి, గన్‌రాజ్ తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి ప్రకాశ్‌రావును పరామర్శిస్తున్న నాయకులు

అన్నప్రాసనలు.. సీమంతాలు

కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

చందుర్తి, మార్చి 27: బండపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తర్వాత కేంద్రంలోని పిల్లల రిజిస్టర్ ను పరిశీలించారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శి రమేశ్‌బాబు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు బుర్ర రేణుక, న్యాత పద్మ, జీ రేణుక ఉన్నారు.

నూతన కార్యవర్గ పత్రాన్ని ఎంపీడీవోకు అందిస్తున్న కార్యదర్శులు

కార్యవర్గం ఎన్నిక

రుద్రంగి, మార్చి 27: మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని మండల పంచాయతీ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా తేలు నాగరాజు, ఉపాధ్యాక్షుడిగా ముదాం సతీష్, ప్రధాన కార్యదర్శిగా గంగుల ప్రశాంత్, కోశాధికారిగా మారుపాక సురేశ్‌ను ఎన్నుకున్నామని మండల పంచాయతీ అధికారి సుధాకర్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు నూతన కార్యవర్గ పత్రాన్ని ఎంపీడీవో నటరాజ్‌కు అందజేశారు.

కరీంనగర్ శివారులో యువకుడి ఆత్మహత్య

రాంనగర్, మార్చి 27: కరీంనగర్ శివారులోని కేబుల్ బ్రిడ్జి వద్ద బుధవారం ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం మల్లాపూర్‌కు చెందిన దూది రాజశేఖర్‌రెడ్డి (26) కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో పని చేస్తూ ఇక్కడే ఉంటున్నాడు. రాజశేఖర్ రెడ్డికి వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నించగా, అతడికి గతంలో పరిచయం ఉన్న ఓ యువతి కొంతమందితో మల్లాపూర్‌కు వెళ్లి గొడవ చేసింది. ఈ క్రమంలో సదరు యువతి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడడంతో మనస్తాపానికి గురైన రాజశేఖర్ రెడ్డి బుధవారం తెల్లవారుజామున తీగల బ్రిడ్జి సమీపంలో పురుగుల మందు తాగాడు. అనంతరం అతడి స్నేహితుడికి ఫోన్ చేసి చెప్పడంతో వెంటనే వెళ్లి నగరంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రభుత్వ దవాఖానకు తరలించగా రాజశేఖర్ రెడ్డి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, మృతుడి జేబులో సూసైడ్ లెటర్ దొరికింది. మృతుని తండ్రి రఘుపతి రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వన్ టౌన్ సీఐ సరిలాల్ తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

చందుర్తి, మార్చి 27: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని చందుర్తి పీఏసీఎస్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్ పేర్కొన్నారు. సనుగుల జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన మారం హన్మాండ్లు పదవీ విరమణ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో ఆయనను ఉపాధ్యాయులు సన్మానించారు. ఇక్కడ హెచ్ఎం రేగొండ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

కోఆప్షన్ సభ్యుడికి పితృవియోగం

సిరిసిల్ల రూరల్, మార్చి27: తంగళ్లపల్లి మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎండీ తాజొద్దీన్‌కు పితృవియోగం కలిగింది. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన తాజొద్దీన్ తండ్రి బాబుమియా (70) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. బాబుమియాకు భార్య పుత్లిమా, కొడుకులు ఖలీల్, సలీం, తాజోద్దిన్ ఉన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194